5 నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఈ నెల 5 నుంచి 9వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం, వనమహోత్సవం అమలు తీరుపై చేపట్టాల్సిన వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమంలో రోజువారీగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలో జడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతి నిధులు, స్వయం సహాయక సంఘాలు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. పరిసరాల శుభ్రత, సీజనల్ నివారణపై అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యార్థులకు పోటీలు

'స్వచ్ఛదనం-పచ్చదనం'పై విద్యార్థులకు వ్యాసరచన, పద్య గేయాల పోటీలు నిర్వహించి బహుమతులను అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ డీఈవోకు సూచించారు. వన మహోత్సవం కింద గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పట్టణాల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో భోజి, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ నర్సింహులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయలక్ష్మి, డీటీడబ్ల్యువో నీలిమ, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేగుంటలో..

చేగుంట, ఆగస్టు 2 : అగస్టు 5నుంచి 9వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేగుంట ఎంపీడీవో చిన్నారెడ్డి పేర్కొన్నారు. చేగుంట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం చేగుంట, నార్సింగి మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రశాంత్, ఏపీవో శ్వేత, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాపూర్‌లో ముగిసిన ట్రిబుల్ ఆర్ సర్వే

సర్వే చేస్తున్న అధికారులు

నర్సాపూర్, ఆగస్టు 2 : శివంపేట్ మండల పరిధిలోని రత్నాపూర్‌లో ట్రిబుల్ ఆర్ సర్వే పనులు ముగిశాయని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 3.8 కిలోమీటర్ల మేర 100 ఎకరాల భూమిని సర్వే చేశామని వెల్లడించారు. ఈ సర్వేలో గ్రామస్తులందరూ పాల్గొని తమ వివరాలను అధికారులకు ఇచ్చారని తెలిపారు. గ్రామంలో సర్వే పూర్తవడంతో రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించిన సర్వే దాదాపు ముగిసిందని తెలిపారు. నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లిలో 34 ఎకరాల భూమిని సర్వే చేస్తే పూర్తిగా ఆర్ఆర్ఆర్ సర్వే ముగుస్తుందని వెల్లడించారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామస్తులు

కౌడిపల్లి, ఆగస్టు 2 : మండల పరిధిలోని రాజిపేట పీఎస్‌లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు మహేందర్, నవాజ్, సుజాతలను శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. ఆ పాఠశాలకు బదిలీపై వచ్చిన నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మన్నెకుమార్, మాజీ సర్పంచ్ పాష, మాజీ ఉప సర్పంచ్ ఊర్లమాధవిశివ, బాంచనాగభూషణం ముదిరాజ్ బీఆర్ఎస్ రాజిపేట్ గ్రామ అధ్యక్షుడు రాఘవేందర్, పాఠశాల మాజీ చైర్మెన్ శేఖర్, వ్యవసాయ గ్రామ శాఖ అధికారి గణేశ్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

రామాయంపేట : అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళితులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణ అంశంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని మాదిగ మహిళా సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మ, మమత, రేణుక, అనిత, సుగుణ, లత తదితరులు పాల్గొన్నారు.

చిరకాల వాంఛ నెరవేరింది..

మాదిగ, మాదిగ ఉప కులాల చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణ అమలుకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర లింగం, నాయకులు శ్రీనివాస్, రాములు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తీసుకురావాలన్నారు.

శివ్వంపేటలో..

శివ్వంపేట, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణకు నిరంతరం శ్రమించి వర్గీకరణ సాధించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి శుక్రవారం శివ్వంపేటలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి మాదిగ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాల్దాస్ అరవింద్‌గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకలి బిక్షపతి, డాక్టర్ కర్రె మహేష్, వంజరి శ్యామ్, నారాయణగారి వినోద్‌కుమార్, బొంది శ్రీనివాస్‌గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షులు బల్కంపేట భాస్కర్, ఉదండపురం నర్సింలు, కుంట లింగం చింతకింది పోషం, పెద్దకొల్ల జగదీశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయడంతో మండల పరిధిలోని ఆర్.వెంకటాపూర్ శుక్రవారం సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండారి కిషన్, కొమ్మగళ్ల కృష్ణ, సందీప్, ప్రభుదాస్, స్వామి, వినోద్, రాజు, రవి, సిద్ధిరాములు, ప్రవీణ్, శ్రీనువాస్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

చిలిపిచెడ్ : తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

చిలిపిచెడ్, ఆగస్టు 2: తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివని సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చిలిపిచెడ్ అంగన్‌వాడీ-2 కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి ప్రతిమ, ఆశ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

రామాయంపేట, ఆగస్టు 2: పట్టణంలోని ఆరో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పాలు, గుడ్లు అంద జేశారు. కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ దేమె యాదగిరి, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానలో..

రేగోడ్, ఆగస్టు 2: మండల కేంద్రంలోని సర్కారు దవాఖానలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, డాక్టర్ శ్వేత గర్భిణులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పద్మ, కళావతి, ఆశ వర్కర్లు మరియమ్మ ,గర్భిణులు తదితర్లు పాల్గొన్నారు.

చిలిపిచెడ్: తాజా మాజీ సర్పంచులను అరెస్టు చేసిన ఎస్సై

రామాయంపేట : పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

కౌడిపల్లి : పోలీసుల అదుపులో మాజీసర్పంచులు

పెండింగ్ బిల్లులపై గరం గరం

■ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల నిధులు విడుదల చేయాలని డిమాండ్ ■ అసెంబ్లీ ముట్టడికి మాజీ సర్పంచులు ■ ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీ ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు. . సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడి పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ప్రజా ప్రతినిధులను జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామాల అభివృద్ధికి అప్పులు తెచ్చి పనులు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా జ్యాపం చేస్తున్నదన్నారు. వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ఆరెస్టు చేయించడం కాదు.. చేసిన పనుల బిల్లులు వెంటనే విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. - న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 2

చిన్నశంకరంపేట: పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

చేగుంట: పోలీసుల అదుపులో మాజీ ప్రజాప్రతినిధులు

నిజాంపేటలో..

నర్సాపూర్: పెద్దచింతకుంటలో..

అనారోగ్యంతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

వెంకటేశ్ (ఫైల్)

నర్సాపూర్, ఆగస్టు 2 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తొంట వెంకటేశ్ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. నర్సాపూర్ ఉపసర్పంచ్‌గా తన సేవలను అందించారు. తొంట వెంకటేశ్ మృతిపై పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. తొంట వెంకట్ మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పలువురు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు

నర్సాపూర్, ఆగస్టు 2: మండల పరిధిలోని పెద్దచింతకుంట శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీ.ఏ/బీ.కాం/బీ.ఎస్సీ) కోర్సుల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ట్యూషన్ ఫీజును చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేని వారు ఈ నెల 18లోపు చెల్లించాలన్నారు. వివరాలకు 7382929736, 18005990101 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శివ్వంపేట, ఆగస్టు 2 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శివ్వంపేటలోని నర్సాపూర్-తూప్రాన్ ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. బిక్యతండా పంచాయతీ పరిధిలోని నానుతండాకు చెందిన రాందాస్‌నాయక్ శివ్వంపేటలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశావత్తు లారీ ఢీకొని కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు, కుటుంబీకులు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యదర్శికి సన్మానం

చిన్నశంకరంపేట, ఆగస్టు 2 : బదిలీపై వెళ్తున్న మాందాపూర్ పంచాయతీ కార్యదర్శి ప్రమోదను శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భిక్షపతిగౌడ్, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, కరుణాకర్, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ

పెద్ద శంకరంపేట : గడికోటలో బోనాలతో భక్తజన సందోహం


కౌడిపల్లి: కొట్టాలలో..

పెద్దశంకరంపేట, ఆగస్టు 2 : బోనాల పండుగను శుక్రవారం సాయంత్రం పెద్దశంకరంపేటలోని రాణి శంకరమ్మ గడికోటలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక (చావిడి) శ్రీ సరస్వతి శిశు మందిర్ నుంచి మహంకాళి చిత్రపటాని పట్టణ పురవీధులగుండా గడికోటలోని దుర్గామాత అమ్మవారికి బాజాభజంత్రీలతో, డప్పు వాయిద్యాలతో, శివసత్తుల నృత్యాలతో, జానపదాల హోరు, గట్టాల ఊరేగింపుతో వైభవంగా సాగింది. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లారు. గడిలో దుర్గామాతకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. శంకరమ్మ గడికోటకు భక్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో గడికోట ప్రాంగణం భక్తులతో కిటకిట లాడింది.

కొట్టాల గ్రామంలో..

కౌడిపల్లి, ఆగస్టు 2: మండల పరిధిలోని కొట్టాల గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా శుక్రవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నల్ల పోచమ్మకు బోనాలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. నల్ల పోచమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు అంజనేయులు, ఉపాధ్యక్షుడు అంబూరి కిశన్, మాజీ సర్పంచ్ నరహరి, నారాయణ, పవన్, దుర్గయ్య, శెట్టయ్య, ముదిరాజ్ యువకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు 2 : జిల్లా రోడ్డు ప్రమాదాల నివారణ, చోరీలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 30 మంది సిబ్బందిని నియమించామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వీరు రాత్ర వేళల్లో పెట్రోలింగ్‌తో పాటు రోడ్లపై తనిఖీలు చేపడతారన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్, సిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై పోలీసులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తారని తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తూప్రాన్ సీఐ రంగకృష్ణ, ఎస్సై నవత ఉన్నారు.

జిల్లాలో ఎస్సైల బదిలీలు

మెదక్ అర్బన్, ఆగస్టు 2: జిల్లాలో ఎస్సైలను బదిలీ చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బి.లింగం ప్రస్తుతం వీఆర్ మెదక్‌లో విధులు నిర్వహిస్తుండగా బదిలీపై నర్సాపూర్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. ఎస్.శ్రీనివాస్‌గౌడ్ మాచారెడ్డి, కామారెడ్డి జిల్లాలో ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా బదిలీపై పాపన్నపేటకు, బీ.మురళీ టెక్మాల్ ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా, బదిలీపై మెదక్ రూరల్ ఎస్సైగా, ఎస్.సత్యనారాయణ జుక్కల్, కామారెడ్డి జిల్లా విధులు నిర్వహిస్తుండగా హవేళిఘనపూర్ ఎస్సైగా బదిలీ అయ్యారు. టీ.రాజు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా బదిలీపై వెల్దుర్తి ఎస్సైగా, కంది సుధాకర్ కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా బదిలీపై టెక్మాల్ పోలీస్‌స్టేషన్‌కు ఎస్సైగా, డీ.నవత వెల్దుర్తి పీఎస్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా బదిలీపై డీఎస్‌బీ మెదక్‌కు రానున్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

కౌడిపల్లి : ఇంటింటికీ వెళ్లి శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

కౌడిపల్లి, ఆగస్టు 2 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం కౌడిపల్లితో పాటు పలు గ్రామాల్లోని పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరి చేరవని సూచించారు. తొట్లల్లో నీటి నిల్వలు ఉంచుకోవద్దన్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చిట్కుల్‌లో..

చిలిపిచెడ్, ఆగస్టు 2 : మండల పరిధిలోని చిట్కుల్‌లో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి మాన్యనాయక్, ఎంపీడీవో ఆనంద్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వీధుల్లో తిరిగి మురుగు కాల్వలో ఆయిల్ బాళ్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శరత్‌రెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఆశ వర్లర్లు, కార్మికులు తదితరులుపాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

రామాయంపేట, ఆగస్టు 2: రామాయంపేట పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్, కౌన్సిలర్ దేమె యాదగిరి పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా పట్టణంలోని 6, 8 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటిని నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో బిల్ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, వాసవి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

8వ వార్డులో..

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ జయశ్రీ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా 8వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులు, ఆశ వర్కర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహ న కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిల్లాయి రోడ్డుకు మరమ్మతులు చేయాలి

డిల్లాయికి వెళ్లే దారిలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్, ఆగస్టు 2: మండల పరిధిలోని కూచారం నుంచి డిల్లాయికి వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నదని, ఈ విషయమై ఎన్నిమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఉదయం, రాత్రి వేళల్లో పరిశ్రమకు వెళ్లే భారీ వాహనాలు ఈ రోడ్డుపై వెళ్తుండటంతో రోడ్డంతా బురదమయంగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రోడ్డుపై నాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కొమురవెల్లి, ఆగస్టు 2 : రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని కొమురవెల్లి మండల వ్యవసాయాధికారి శుక్రవా రం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 28 నాటికి నూతనంగా పాస్‌పు స్తకాలు పొంది 18 నుంచి 59ఏండ్ల వయస్సు కలిగిన రైతులు తమ పాస్‌బుక్ లేదా తహసీల్దార్ తో డిజిటల్ సంతకం అయిన పేపర్, రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు దరఖాస్తు ఫారం నింపి ఆగస్టు 5వ తేదీలోపు ఆయా క్లస్టర్లలోని ఏఈవోలకు ఇవ్వాలన్నారు.

చిట్కుల్‌లో వీధి దీపాలు అందజేత

గ్రామ కార్యదర్శికి వీధి దీపాలు అందజేస్తున్న దాత తార విష్ణువర్ధన్‌రెడ్డి

చిలిపిచెడ్, ఆగస్టు 2 : మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన దాత పంచాయతీ పరిధిలోని ఉన్న విద్యుత్ స్తంభలకు వీధి దీపాలను ఉచితంగా అందజేసినట్లు గ్రామ కార్యదర్శి తిరుపతి తెలిపారు. అనంతరం గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ.. దాత తార విష్ణువర్ధన్‌రెడ్డి సొంత ఖర్చులతో వంద వీధి దీపాలు అందజేసినందుకు పంచాయతీ తరపున ప్రత్యేక కృత్తతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, అఖిల్, జనార్దన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి చేద్దాం

మాట్లాడుతున్నబీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గంగారాం

రామాయంపేట, ఆగస్టు 2: దివ్యాంగుల హక్కుల సాధనకు పార్టీలు, కులాలకతీతంగా పోరాడుదామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం, వికలాంగుల పోరాట సమితి అధ్యక్షుడు పాతూరి శ్రీనువాస్ పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 7న దివ్యాంగుల జిల్లా సమావేశంలో కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. 28న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేటర్ దరఖాస్తు గడువు పొడిగింపు

కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2 : ఇంటింటా ఇన్నోవేటర్-2024 దరఖాస్తు గడువు ఈ నెల 10వరకు పొడిగించినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణ కర్తలు తమ ఎంట్రీలను ఈ నెల 10లోగా అందజేయాలన్నారు. ఈ ఏడాది 6వ ఎడిషన్‌తో ముందుకొచ్చిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం గ్రామీణ తెలంగాణలో ఆవిష్కరణ, వ్యవస్థాపకతను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సరికొత్త ఆవిష్కరణలు తయారు చేసిన వారిని స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. ఆవిష్కరణకర్తలు 9100678543 నంబర్‌కు వాట్సాప్ ద్వారా దరఖాస్తులను పంపాలన్నారు.

రేపు మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 2 : ఉమ్మడి మెదక్ జిల్లా మహిళా ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 4 నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఫొటో, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో లేదా జన్మదిన జిరాక్స్ కాపీలతో ఉదయం 7 గంటలకు మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియానికి రావాలని కోరారు.

వాహనాల తనిఖీ

చిలిపిచెడ్, ఆగస్టు 2 : ఎస్పీ ఆదేశాల మేరకు మండల పరిధిలోని చండూర్ చౌరస్తాలో శుక్రవారం ఎస్సై షేక్ మహబూబ్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు మత్తు పదార్థాలను తరలించరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హైనా దాడిలో గేదె మృతి

చేగుంట, ఆగస్టు 2 : హైనా దాడిలో గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన గడ్డ చంద్రం తన వ్యవసాయ పొలం వద్ద గేదెను కట్టివేసి రాత్రి ఇంటికి వచ్చాడు. అటవీ ప్రాంత సమీపంలో ఉండడంతో హైనా దాడి చేయడంతో గేదే మృతి చెందినట్లు తెలిపారు. గేదె విలువ రూ.25 వేలు ఉటుందని, అటవీ అధికారులు ఆదుకోవాలని బాధితుడు కోరారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ యువకుడు మృతి

సంతోశ్ (ఫైల్)

చేగుంట, ఆగస్టు 2 : సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ విద్యుత్‌షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఇబ్రహీంపూర్‌లో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బెదరబోయిన సంతోశ్ (25) గురువారం రాత్రి ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాడి రైతుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

రేగోడ్, ఆగస్టు 2 : పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులు చెల్లించాలని పాడి రైతులు కోరారు. పాడి రైతులకు సకాలంలో నెలానెలా విజయ పాలశీతలీకరణ కేంద్రం పాల బిల్లులు రాక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పశుగ్రాస కొనుగోలు, కుటుంబ పోషణకు అప్పు చేయాల్సి వస్తుందని తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

మండల ప్రత్యేక అధికారిగా నీలిమా

చిన్నశంకరంపేట, ఆగస్టు 2 : చిన్నశంకరంపేట మండల ప్రత్యేక అధికారిగా నీలిమా శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నీలిమా మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WATER PROOFING

★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325779-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.